ఏనుగుల దాడిలో చెరకు ధ్వంసం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఏనుగుల దాడిలో చెరకు పంట ధ్వంసమైనట్టు రైతులు తెలిపారు. మండలంలోని వెలుతురుచేను అటవీ ప్రాంతంలో సమీపంలోని పొలాల్లో శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన కాళేప్పకు చెందిన చెరుకు పంటను ఏనుగుల గుంపు చెరకు పంటను తిని తొక్కి నాశనం చేశాయి. సమాచారం తెలపడంతో అటవీ శాఖ సిబ్బందికి తెలపగా ఆటవీశాఖ అధికారి ఎఫ్ఎస్ఓ మోహన్ మురళీ, అటవీ శాఖ సిబ్బంది, ట్రాకర్లు సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తుల సహకారంతో బాణాసంచ పేల్చడంతో డప్పులు వాయించారని శబ్దాలు విని ఏనుగులు తాళ్ళమడుగు ఆటవీప్రాంతం వైపు తిరుగు ముఖం పట్టాయని తెలిపారు. పంట నష్టంను అంచనా వేసి పైఅధికారులకు నివేదికలు పంపి పంటనష్టాన్ని అందించినట్టు అటవీ శాఖ సిబ్బంది తెలిపారు.

కోడిపందెం, జూదం నిర్వహిస్తే కఠినచర్యలు: ఎస్పీ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని జిల్లాలోని పట్టణాలు, గ్రామాలు, శివార్లు ఇతర ప్రాంతాల్లో కోడి పందేలు, పేకాట, జూదం నిర్వహించడం పూర్తిగా నిషేధమని, ఎవరైనా సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు తోడ్పడినా, నిర్వహించినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని చిత్తూరు జిల్లా ఎస్పీ వివిఎన్.మణికంఠ చందోలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సంక్రాంతి పండగ సాంప్రదాయాలకు ప్రతీక, దాన్ని కుటుంబసభ్యులతో ఆనందోత్సాహాలతో, సాంప్రదాయ క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ జరుపుకోవాలి. కానీ కోడి పందేలు, జూదాలు వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సమాజాన్ని దెబ్బతీయడం మాత్రమే కాదు, ఎన్నో కుటుంబాల జీవితాలను నాశనం చేస్తాయి. యువత ఈ అసాంఘిక చర్యలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. పోలీసులు జిల్లా వ్యాప్తంగా గట్టి చర్యలు చేపడుతున్నారని, ఎక్కడైనా కోడి పందేలు, జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వవచ్చు అని, పోలీసు వాట్సాప్ నంబర్ 94409 00005కు సమాచారాన్ని పంపించవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతుందని, మీ సహకారం మాత్రమే శాంతియుతమైన సమాజ నిర్మాణానికి పునాది అని ఎస్పీ తెలిపారు.

తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా మణికంఠ చందోలు

తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీగా చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలును రాష్ట్ర డిజిపి ద్వారక తిరుమలరావు నియమించారు. శనివారం ఉదయం తిరుపతి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా తిరుపతి ఎస్పీ కార్యాలయంలో చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు బాధ్యతలు స్వీకరించారు.

వారపు సంతలో సంక్రాంతి ధరల మోత

రోడ్డుపైనే వారపు సంత నిర్వహణ దృశ్యాలు

ప్రజాశక్తి -సోమల

మండల కేంద్రమైన సోమలలో శనివారం నిర్వహించిన వారపు సంతలో కూరగాయల ధరల మోత మోగడంతో పేదలు, మధ్యతరగతివారు కాయగూరలు కొనలేక పండుగ బంధువులతో కలసి ఆనందంగా నిర్వహించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి శనివారం మండల కేంద్రంలో వారపు సంత నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం నిర్వహించిన వారపు సంతలో ప్రతి కూరగాయ ఆకుకూరలు అధిక ధరలను పలకడంతో ప్రజలు ఆలోచించి కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంకాయలు, బెండకాయలు, బీరకాయలు, దొండకాయలు, బీన్స్, ఆకుకూరలు ఏవైనా కిలో రూ.80ల పైగా ధరలు పలికాయి. సంక్రాంతి పండుగకు అధికంగా ఇండ్లలో అనపకాయలను కొని వాటిలోని అనప గింజలు వలిచి మసాలా కూర చేసి దోసెలకు అనుపానంగా తినడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం వరకు కిలో 40 నుండి 50 రూపాయలు పలికిన అనపకాయలు ఒక్కసారిగా శనివారం సంతలో ఏకంగా కిలో రూ.100లు పలకడంతో వినియోగదారులు కొనలేక ఆలోచనలో పడ్డారు. కంది, అలసంద కాయలు తదితర కూరగాయలు కూడా కిలో రూ.100లు పలకడంతో మధ్యతరగతి నిరుపేద కుటుంబాల వారు కిలో కొనేవారు కూడా 1/2 కేజీ కొని చాలు అనుకుంటున్నారు. కాగా వారపు సంత నిర్వహణ ద్వారా పంచాయతీకి అధికంగా ఆదాయం వస్తూ ఉంది అయితే వారపు సంతలో కనీస సౌకర్యాలు తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంతో అటు వ్యాపారస్తులు ఇటు వినియోగదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా పుంగనూరు తిరుపతి ప్రధాన రహదారిపై వారపు సంత నిర్వహిస్తూ ఉండడంతో వ్యాపారస్తులు కూడా రోడ్డుపైనే తమ దుకాణాలు ఏర్పాటు చేస్తూ ఉండడంతో నిత్యం వారపు సంత జరిగే సమయంలో రాకపోకలకు ఇబ్బందిగా మారుతూ ఉంది. ట్రాఫిక్ నియంత్రణ చేయాల్సిన పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకుండా పోవడంతో నిత్యం వారపు సంత సమయంలో ట్రాఫిక్ అంతరాయాలు కలుగుతున్నాయి.

శనివారం జరిగిన వారపు సంత దృశ్యాలు

పిల్లలతో పాటు బావిలో దూకిన తల్లి

పిల్లలు ఇద్దరు మృతి

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లి

తల్లీ కూతుళ్ల (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి- విజయపురం (నగరి): పిల్లలతో దేవి అనే ఓ తల్లి బావిలో దూకిన విషాద సంఘటన నగరి మున్సిపాలిటీ సాళ్వపట్టెడలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ పరిధి భీమానగర్‌కు చెందిన దేవి (33) అనే మహిళకు తమిళనాడు చెన్నై వెస్ట్‌మాంబళంకు చెందిన ధనంజయులు అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఐశ్వర్య (10), అక్షర (3) అనే ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. పండగలకు, శుభకార్యాలకు పిల్లలతో పాటు పుట్టింటికి వచ్చే దేవి అందరితో కలుపుగోలుగా ఉండేది. అయితే ఈ సంక్రాంతిని సందర్భంగా గురువారం చెన్నై నుంచి సప్తగిరి ట్రైన్‌లో పిల్లలతో పాటు దేవి భీమానగర్‌లోని పుట్టింటికి వచ్చింది. అయితే ఆమె కళ్లలో పుట్టింటికి వచ్చిన ఆనందం కనిపించలేదు. శుక్రవారం సాళ్వపట్టెడలోని పెదనాన్న ఇంటికి వెళ్లి వస్తానని పిల్లలను తీసుకొని వెళ్లింది. అయితే ఆమె తిరిగిరాకపోవడంతో తల్లిదండ్రులు సాళ్వపట్టెడలోని బంధువుల వద్ద విచారించగా ఆమె అప్పుడే వెళ్లిపోయిందన్నారు. ఎంతకూ ఆమె రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు పోలీసులకు శనివారం ఉదయం ఫిర్యాదు చేశారు. శనివారం సాయంత్రం సాళ్వపట్టెడ శివారుల్లో ఆవులు తోలుకువస్తున్న వ్యక్తులకు అక్కడున్న బావినుంచి మూలుగు శబ్దాలు వినిపించాయి. వారు బావిలో చూడగా తాడుపట్టుకొని వేలాడుతున్న దేవి కనిపించడంతో ఆమెను స్థానిక యువకులు కలిసి పైకిలాగారు. పిల్లల కోసం గాలింపు చేపట్టారు. రాత్రి ఫైర్‌స్టేషన్ సిబ్బందితో కలిసి స్థానికులు ఇద్దరు చిన్నారులను విఘత జీవులుగా బావి నీటినుంచి బయటకు తీశారు. ఆడుతూ పాడుతూ తిరిగే పిల్లలను మృతదేహాలుగా చూడటంతో కుటుంబ సభ్యులతో పాటు, గ్రామస్తులను కలచివేసింది. తాము ఇంకెవ్వరితో ఆడుకోవాలంటూ పిల్లల అవ్వతాతలు పెట్టిన కన్నీరు అందరినీ కంటతడి పెట్టించింది. దీంతో భీమానగర్, సాళ్వపట్టెడ ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. దీనికి కల కారణలను సీఐ మహేశ్వర్ నేతృత్వంలో విచారణ చేపట్టారు.

మృతి చెందిన ఐశ్వర్య

మృతి చెందిన అక్షర

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవి

నెరవేరని హామీలు

- ఆందోళనలో జనం
- పోరాటాలకు సై

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి వంద రోజులకు పైగా అవుతోంది. ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమల్లో అలసత్వం ప్రదర్శిస్తుండంతో ప్రజల నుండీ వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఎక్కడికక్కడ జనం ఎన్నికల హామీలు అమలు చేయాలని నిలదీస్తున్నారు.

2023 ఎన్నికల్లో తెలుగుదేశం, బిజెపి, జనసేన కూటమిగా ఎన్నికల్లో పోటీ చేశాయి. నాటు ఎన్నికల్లో అనేక రకాల హామీలిచ్చాయి. వాటిలో తల్లికి వందనం పేరిట ప్రతి ఇంట్లో ఒక్కరు ఇద్దరు నలుగుర్ను అందరీకి ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం, కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం ఈ పథకం అమలు చేసినా మొదట్లో తెల్లరేషన్‌కార్డు కలిగిన అందరికీ వర్తింస్తుందని ప్రకటించినా వివిధ రకాల ఆంక్షలతో చాలా మందికి ఈ పథకం వర్తించడం లేదు. ఆదాయ పరిమితి, ఇంటి నిర్మాణం వంటి ఆంక్షలతో అనేక మందిని అనర్హులుగా తెల్చి ఉచిత గ్యాస్ సిలిండర్‌కు అనర్హులుగా తెల్చారు. ఇదో.. అదిగో.. అంటూ మహిళలకు ఉచిత ఆర్‌టిసి బస్సులో ప్రయాణం ప్రయాసగా మారింది. ఉచిత ఆర్‌సి బస్సు ప్రయాణాల కోసం మహిళలు ఎదురు చూస్తున్నారు. ఐదేళ్ళలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులకు లక్ష ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. నేటి వరకు ప్రభుత్వం ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసిందో ఎంత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారో స్పష్టత లేదు. ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువత అన్నామో.. రామచంద్ర.. అంటూ అల్లాడుతున్న పరిస్థితి. నిరుద్యోగ భృతి ఊసేలేదు.. మహిళా ఆర్థిక చేయత కోసం ఏడాదికి రూ.15వేలు అమలు ఎక్కడ అంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు. స్కిల్ గణన ఎక్కడ అంటున్నారు. చిన్న తరహా పరిశ్రమలకు 10 శాతం సబ్సిడీ అమలు వంద రోజుల కూటమి ప్రభుత్వంలో అమలుకు నోచుకోలేదు. డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు కళగానే మిగిలింది. బీసీ డిక్లరేషన్ ఎక్కడ, బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్స్‌కు నిధులు మంజురు కాలేదు. ఇలా అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఎన్నిక సందర్భంగా ఇచ్చిన హామీలు వందరోజులు పైగా పాలన సాగించినా ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోకపోవడంతో ప్రజలు ఉద్యమాలకు సిద్ధం అవుతున్నారు. అలాగే ట్రూఆప్ ఛార్జీ భారాన్ని భరించలేమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నీటి బొట్టూ.. ముఖ్యమే..

- వృథాగా పోతున్న తాగునీరు
- పట్టించుకోని అధికారులు
- వేసవిలో నీటి ఎద్దడి తప్పదంటున్న ప్రజలు

ప్రజాశక్తి- వెదురుకుప్పం: ప్రతి నీటి బొట్టు .. ఎంతో విలువైంది.. పట్టించుకోకుండా వదిలేై... రాబోయే రోజుల్లో భవిష్యత్తు ప్రస్నార్థకమే...! నీళ్లు ఉన్నాయి కదా అని ఇష్టానుసారంగా తోడేస్తే.. నీటి ఎద్దడి తప్పదు.. ఇటువంటి సంఘటన వెదురుకుప్పం మండలం తోటానపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. గతంలో ప్రభుత్వం నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంక్ నుంచి తాగునీరు చాలా రోజులుగా పైపులు పగిలిపోవడంతో వృథాగా పోతోంది. నిత్యం ఇదేవిధంగా నీళ్లు పోతుంటాయని స్థానికులు చెబుతున్నారు. ఈ ట్యాంక్ నుంచి తోటానపల్లె గ్రామం, ఆది అరుంధతి వాడలోని కుటుంబాలకు పైపు లైన్ల ద్వారా నీళ్ళు వెళుతున్నాయి. నీరు వృథాగా పోతుండంతో రానున్న వేసవి రోజుల్లో తాగునీటికి ఇబ్బందులు తప్పదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పట్టించుకొని నీరు వృథాగా కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

గోకులం షెడ్ల ప్రారంభోత్సవాలు


చిత్తూరులో ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- యాదమరి: మినీ గోకులాలను గ్రామాల్లోని పాడి రైతులకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని 184 గొల్లపల్లి గ్రామంలో నిర్మించిన మినీ గోకులాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయానికి అనుబంధంగా పసువులకు చేయూత అందించి పాడి పరిశ్రమలకు ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం గోకులాలను (పశువుల షెడ్లు) ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేయటం జరిగిందన్నారు. మండలం కు 62 గోకులం షెడ్లు మంజూరు చేయడం జరిగిందని, రైతుల కోరిక మేరకు మరిన్ని మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. 12 కమ్మపల్లి గ్రామపంచాయతీ చెందిన మర్లబండ గ్రామప్రజలు తమ గ్రామం నుండి గ్రామ సచివాలయానికి దారి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే దారి సౌకర్యం ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండల అభివృద్ధి అధికారి వేణు, ఏపీడి సుబ్రహ్మణ్యం, ఉపాధి హామీ సహాయాధికారి బాల, టెక్నికల్ అసిస్టెంట్ మధు, ఈఓపిఆర్‌డి సుకుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు మొరార్జీ, కార్యదర్శి రబ్బి వెంకటేష్, ఎంపీ జయప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

తవణంపల్లి: మండలంలో పల్లి గ్రామపంచాయతీ నిర్మించిన పశువుల షెడ్లను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీవో లలిత, మండల టిడిపి అధ్యక్షుడు గాలి దిలీప్, వెంకటేశ్వర చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గోకులం షెడ్డు పథకం పాడి రైతులకు వరం లాంటిదని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు.

జీడీ నెల్లూరులో ఎమ్మెల్యే డాక్టర్ థామస్

బంగారుపాళ్యంలో ఎమ్మెల్యే మురళీ మోహన్

శనివారం చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరు, గుడిపాల మండలం వసంతపురం పంచాయతీ పరిధిలోని పసమంద, కృష్ణ జెమ్మాపురం గ్రామాల పరిధిలోని నిర్మించిన గోకులం షెడ్డులను ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆప్యాయంగా మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గోకులంలోని పశువులకు మేత తినిపించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎపీడీ సుబ్రహ్మణ్యం, పశు వైద్యాధికారి శివరాజన్, ఏవో వేణుగోపాల్, ఏపీవో రెడ్డమ్మ, నాయకులు శశికర్ బాబు, గుడిపాలలో ఏవో మాధవి, పశువైద్యాధికారి సాయిసుధా, ఎపీవో శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షులు సుబ్బానాయుడు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని పాతపాల్యం పంచాయతీ మొలకలకండ్రిగ, మిట్టకొత్తూరు గ్రామంలో పాడి రైతులు నూతనంగా నిర్మించిన గోకులం షెడ్లను ఎమ్మెల్యే విప్ డాక్టర్ థామస్ శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కువమంది రైతులు పాడిపశువులపై ఆధారపడి జీవిస్తున్నారని వారికి గోకులం షెడ్లు ఎంతగానో ఉపయోగపడతాయని వీటిని నిర్మాణానికి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా రెండు లక్షల 30 వేల రూపాయలు అందిస్తోందన్నారు. పాడి రైతులకు అభివృద్ధికి ఇంకా కృషి చేస్తామని చెప్పారు. సర్పంచ్, టిడిపి జిల్లా కార్యదర్శి కృష్ణమ నాయుడు, ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి, పశు సంవర్ధక శాఖ ఏడి మురళి, ఉపాధి హామీ ఎపిఓ శ్రీనివాసులు, వర్క్ ఇన్స్పెక్టర్ గీత, ఫీల్డ్ అసిస్టెంట్ సురేంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, మండల అధ్యక్షుడు స్వామిదాస్ పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: పాడి పరిశ్రమ అభివృద్ధికి గోకుల పథకం అని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. మండలంలోని రాగిమానుపెంట, వేపనపల్లి గ్రామాల్లో నూతనంగా మంజూరు చేసిన గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని వారి జీవన అభివృద్ధికి పాడి పరిశ్రమ ఆధారం కాబట్టి పాడిని అభివృద్ధి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పలు రాయితీలతో పథకాన్ని ప్రారంభిస్తున్నదని, దీన్ని గ్రామీణ ప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, ఎంపీడీవో శ్రీధర్, సర్పంచ్ కోక ప్రకాష్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జి ధరణి నాయుడు పాల్గొన్నారు.

రామకుప్పం: రాష్ట్రంలో రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని మణింద్రం గ్రామ పంచాయతీలో గోకులం షెడ్లను ప్రారంభించారు. రైతుల కోసం ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్, వ్యవసాయ పనిముట్లు, షెడ్లు, బ్యాంకు రుణాలు, చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు తదితర వాటికి ప్రోత్సహించి సబ్సిడీ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. రైతులందరూ ఈ అవకాశాలని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపిఓ రవికుమార్, శ్రీరాములు రెడ్డి, మంజునాథ్ రెడ్డి, వెంకటరమణ, రామలింగారెడ్డి, జ్ఞానశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మోహన్‌బాబు, విజయ్, షణ్ముగం, నాగరాజు, గోవిందప్ప, సురేష్ పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి పేదలకు భరోసా: ఎమ్మెల్సీ

కుప్పంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

ప్రజాశక్తి- కుప్పం టౌన్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు భరోసా అని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. శనివారం కుప్పం పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 145 మందికి రూ. 2.93 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వాన్ని సహాయం కోరిన పేదల కోసం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలను సారం అధికారులకు చెక్కులను అందించినట్లు తెలిపారు. ఆర్డీవో శ్రీనివాసరాజు, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, సభ్యులు కన్నన్, టిడిపి మండల అధ్యక్షులు రాజ్ కుమార్, ప్రేమ్ కుమార్, ఆనంద్ రెడ్డి, విశ్వనాథ నాయుడు పాల్గొన్నారు.

రామకుప్పం: శనివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్ మునిరత్నం, టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సురేష్ బాబు బాధితులకు అందజేశారు. మండల పరిధిలోని 21 మందికి రూ.36,52,584లు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు అందజేశారు. కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు, టిడిపి మండల అధ్యక్షులు ఆనంద్‌రెడ్డి, నరసింహులు, చలపతి, సుబ్రి, బాలు, మంజునాథ్, మురళి పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది కుదింపు సరికాదు: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- పుంగనూరు: గ్రామ సచివాలయ సిబ్బంది కుదింపు సరైన పద్ధతి కాదని వారందరిని అలాగే కొనసాగించాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పుంగనూరు పట్టణంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గాంధీ కోరిన గ్రామ స్వరాజ్యంను వైఎస్ జగన్ స్థాపించారన్నారు. సచివాలయం వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రజలకు ఎంత మేలు జరిగిందో టిడిపి కార్యకర్తలను అడిగినా తెలుస్తుందని, నేడు ఆ గాంధీ కోరిన గ్రామస్వరాజ్యంకు చంద్రబాబు, కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. సిబ్బందిని కుదించి ప్రజలు ఎంతగానో మెచ్చిన గ్రామ సచివాలయాలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ సిబ్బంది మొత్తాన్ని ఏపీపీఎస్సీ ద్వారా నియమించామని ఎంతో పారదర్శకంగా ఆనాడు ఎంపిక ప్రక్రియ జరిగిందని తెలిపారు. ఇప్పుడు చంద్రబాబు వారందరినీ కూడా ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో కూడా గ్రామ వాలంటీర్లకు 10 వేల వేతనం ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు, ఆ బూటకపు హామీని నమ్మి, అనేకమంది వాలంటీర్లు కూటమి విజయానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ గాలికి వదిలేసి, ఆ తర్వాత అసలు వారికి ఉద్యోగమే లేకుండా చేశారని, ప్రజలు తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించే పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, మున్సిపల్ చైర్మన్ హలీం బాష, కౌన్సిలర్లు అమ్ము, ఖిజర్, రేష్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ షరీఫ్, జిమ్ము ఇర్ఫాన్, అస్లాం మురాది, కొండ సముద్రం సుబ్బన్న, రాజేష్ పాల్గొన్నారు.

సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు

నియోజకవర్గంలో రూ.3.1 కోట్లతో పనులు : ఎమ్మెల్యే గురజాల

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ : చెప్పినట్లుగానే సంక్రాంతి కల్లా గుంతలు లేని రోడ్లను చేసి చూపించామని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత వైసిపి పాలనలో కనీసం మరమ్మతులను నోచుకోక ప్రజలు గుంతలమయమైన రోడ్లపై ప్రయాణిస్తూ ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రహదారుల అభివృద్ధికి వేగంగా చర్యలు చేపట్టారన్నారు. ఫలితంగా సంక్రాంతి నాటికి రాష్ట్రవ్యాప్తంగా, చిత్తూరు నియోజకవర్గంలోనూ మెజారిటీ రోడ్లకు మరమ్మతులు పూర్తి చేయడం జరిగిందని చెప్పారు. చిత్తూరు నియోజకవర్గంలో మొత్తం 18 పనులకు గాను రూ.3. 1 కోట్లు మంజూరు చేసినట్లు, ఈ నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి నియోజకవర్గంలో జరుగుతున్న రోడ్ల అభివృద్ధిపై చిత్తూరు ఎమ్మెల్యే వారికి ప్రత్యేక లేఖను రాశారు. ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడంలో కూటమి ప్రభుత్వం నిబద్ధతను, చిత్తశుద్ధిని ఇది నిరూపిస్తుందన్నారు.

ఘనంగా సిఆర్ రాజన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగుదేశం జిల్లా అధ్యక్షులు సిఆర్ రాజన్ జన్మదిన వేడుకలు చిత్తూరులో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. మధ్యాహ్నం ఎంఎస్ఆర్ సర్కుల్‌లో అన్నదానం చేశారు. చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్‌మోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్ని సిఆర్ రాజన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లాలోని టిడిపి ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా

వైసీపీ అధికార ప్రతినిధిగా కోదండన్

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వీరక నెల్లూరు కోదండన్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వీరక నెల్లూరు కోదండన్‌ను చిత్తూరు జిల్లా వైసిపి అధికార ప్రతినిధిగా శనివారం నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కోదండన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధికార ప్రతినిధిగా నియమించిన అధినేత జగన్మోహన్ రెడ్డికి, మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామికి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డికి, నియోజకవర్గ ఇన్చార్జి కృపాలక్ష్మికి ధన్యవాదాలు తెలిపారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షులుగా గురవారెడ్డి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: చిత్తూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా ఎస్ఆర్ పురం మాజీ జెడ్పిటిసి పిళ్ళారి కుప్పం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ గురవారెడ్డి నియమించినట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురవారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనకు ఉపాధ్యక్షులు పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా వైసిపి కార్యదర్శిగా వెంకటరమణ

ప్రజాశక్తి- రొంపిచర్ల : చిత్తూరు జిల్లా రొంపిచర్ల మండలానికి చెందిన సీనియర్ నాయకుడు కోటా వెంకటరమణను వైయస్సార్సీపి యాక్టివిటీ కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో అవకాశం కల్పించిన మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యనిర్వహణ కార్యదర్శిగా రజినీకాంత్

ప్రజాశక్తి- గుడిపాల: వైసిపి జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శిగా గుడిపాల మండలం, వసంతాపురం సర్పంచ్ ఎస్ఎస్.రజనీకాంత్‌ను ఆ పార్టీ కేంద్ర కమిటీ శనివారం నియమించింది. అలాగే జిల్లా కార్యాచరణ సభ్యుడుగా కృష్ణమూర్తి రెడ్డి నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రాసనపల్లి ప్రకాష్, మధు రాయల్, మధుసూదన్ రెడ్డితో పాటు పలువురు వారికి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ వైఎస్ఆర్సిపిలో కష్టపడిన వారికి తగిన ఫలితం ఉంటుందని దానికి ఇవే నిదర్శనం అన్నారు.

బిసి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జ్యోతినాథ్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బీసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్ఎన్.జ్యోతినాథ ఎంపిక చేసినట్టు బిసి నాయకులు తెలిపారు. తిరుపతిలో ఆదివారం జరిగిన జాతీయ బిసి సంక్షేమ సంఘం సభలో బంగారుపాల్యం మండలానికి చెందిన ఆర్ఎన్.జ్యోతినాథ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతినాథ్ మాట్లాడుతూ బీసీల సంక్షేమానికి, అభ్యున్నతికి పనిచేస్తానని తనపై నమ్మకంతో పదవి ఇవ్వడం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలు నూకానమ్మ, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కోఆర్డినేటర్ పిబి.లక్ష్మీ ప్రసన్నకుమార్, తిరుపతి జిల్లా అధ్యక్షుడు అమరనాథ్, చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు వెంకట కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ముగిసిన వైకుంఠ ద్వాదశి వేడుకలు

ప్రజాశక్తి- కార్వేటినగరం

టీటీడీకి అనుబంధమైన శ్రీవేణగోపాలస్వామి ఆలయంలో శనివారం వైకుంఠ ద్వాదశి వేడుకలు వైభవంగా ముగిసాయి. ఈ సందర్భంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవిరాట్‌కు అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు వేదమంత్రాల నడుమ తిరుప్పావై కార్యక్రమాన్ని భక్తి శ్రద్దలతో చేపట్టారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేక వాయుద్యాల నడుమ గ్రామవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నమాచార్య సంగీత కచ్చేరి బృందం హరికథ కాలక్షేపం పలువురు భక్తులను ఆకట్టుకుంది. టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబు సురేష్, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వడ్డెర ఓబన్న భారత స్వాతంత్రోద్యమంలో ఒక గణనీయమైన పాత్రను పోషించిన ముఖ్యమైన వ్యక్తి అని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రబ్బానీ బాష తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని పాత గ్రీవెన్స్ హాల్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, రబ్బానీ బాష, వడ్డెర సంక్షేమ సంఘ నాయకులు వడ్డే ఓబన్న జయంతిని పురస్కరించుకొని ఓబన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ వడ్డే ఓబన్న 1845 సంవత్సరంలో వడ్డే ఓబన్న ఈ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని, సుమారు 9వేల మంది సైనికులతో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టారని తెలిపారు. ఈ ఉద్యమం ఉయ్యాలవాడ నరసింహరెడ్డి నేతృత్వంలో సాగిందన్నారు. ఏఓ మాట్లాడుతూ వడ్డే ఓబన్న రైతుల హక్కులను రక్షించడానికి, న్యాయం కోసం పోరాటం సాగించారని, ఆయన సైన్యంలో వడ్డే, బోయ, యానాది, చెంచు వంటివారు భాగస్వాములుగా ఉన్నారని తెలిపారు.

వడ్డెర ఓబన్న నేటి యువతకు స్ఫూర్తి: ఎమ్మెల్యే

వడ్డెర ఓబన్న జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని చిత్తూరు ఎంఎల్ఏ గురజాల జగన్‌మోహన్ అన్నారు. స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో వడ్డెర ఓబన్న జయంతి ఉత్సవాలు ఆ సంఘం నేతృత్వంలో నిర్వహించారు. అలాగే చిత్తూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వడ్డెర ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్, చిత్తూరు జిల్లా టిడిపి అధ్యక్షులు సిఆర్.రాజన్, మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, రాష్ట్ర కార్యదర్శి భీమినేని చిట్టిబాబు, కోదండ యాదవ్, మోహన్ రాజ్, బీసీ నాయకులు లక్ష్మీ ప్రసన్న, ధరణి ప్రకాష్, విజయ్ కుమార్, శంకర్, రవీందర్ రాజు, మురుగేష్, గుణశేఖర్, ఎస్.మురళి, మణికంఠ, ఏఎన్ బాబు, కుసుమ, జగన్నాథం, హరిబాబు, గుర్రప్ప పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరు రూరల్ మండలం టి వడ్డూరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఘనంగా స్వాతంత్ర సమరయోధుడు వడ్డేర ఓబన్న జయంతి వేడుకలు వడ్డెరలు, బీసీ సంఘాల నాయకులు నిర్వహించారు. బీసీ నాయకులు మనోహర్, స్వతంత్ర బాబు, లక్ష్మీపతి యాదవ్, దాసరి రవి ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలోని సుజ్ఞానానంద ఆశ్రమంలో శనివారం వడ్డెర ఓబన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ హాజరయ్యారు. ముందుగా వడ్డెర ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ వడ్డెర ఓబన్న అందించిన సేవలు మరువలేనివని, ఆయన జీవితం తరానికి ఆదర్శప్రాయమని అన్నారు.

బంగారుపాళ్యం: వడ్డెర ఓబన్న సేవలు మరవలేనిదని వడ్డెర విజయభేరి మండల అధ్యక్షులు బండ రామచంద్ర అన్నారు. శనివారం మండలంలోని తూంపాయనపల్లి గ్రామంలో వడ్డెర ఓబన్న జయంతి ఘనంగా నిర్వహించారు. బండా నాగరాజ వెంకటస్వామి, నక్కా మహేష్, వెంకటాచలం, ముని వెంకటయ్య పాల్గొన్నారు.

క్రైం న్యూస్

గుర్తు తెలీని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి

మండలంలోని కడపనత్తంకు చెందిన సైపుల్లా (40) పలమనేరు రూరల్ మండలం, కొలమాసనపల్లి పంచాయతీ కూరుమాయి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొని అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి- విజయపురం (నగరి): మండలంలోని తెరణి గ్రామంలోని ఓంశక్తి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ గేటు తాళాలు పగలగొట్టి లోపలకు వెళ్లిన వారు హుండీని తాళాలు పగలగొట్టి అందులో ఉన్న కానులకు తీసుకెళ్లడంతో పాటు అమ్మవారి పూజలకు వినియోగించే హారతి తట్ట, దీపాలు కూడా దోచుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి: ఎస్ఐ

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరులో రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు కచ్చితంగా పాటించాలని శనివారం ప్రతికా ప్రకటనలో పలమనేరు ఎస్సై స్వర్ణతేజ తెలియజేసినారు. వివిధ పనులు అవసరాల కోసం బయటికి వెళ్లిన ప్రజలు సురక్షితమైన ప్రయాణం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని, వారి కుటుంబాలు అనాధలుగా మిగులు తున్నారని ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెంట్ వినియోగించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపి పట్టుబడినప్పుడు తల్లిదండ్రుల పైన కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా నెంబర్ ప్లేట్ లేకుండా కనిపించే వాహనాలు పట్టుబడినప్పుడు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం మత్తులో డ్రైవింగ్, రాంగ్ రూట్లో డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయవద్దని, జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, భవిష్యత్తు మార్గాన్ని ఎంచుకోవాలాన్నారు.

వరద రాజులు మృతి తీరని లోటు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఏపీ ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి వరదరాజులు గుండెపోటుతో శనివారం తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతి ఏపీ ఎమ్మార్పీఎస్‌కు, దళితులకు తీరని లోటని దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు కొమ్మిట ధనుంజయరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఆదివారం యాదమరి మండలం తెల్లరాళ్లపల్లిలో అంత్యక్రియలు నిర్వహించినట్లు ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లా గవర్నమెంట్ డిగ్రీ కళాశాలల బోధనేతర సిబ్బంది సంఘం 2025 క్యాలెండర్ శనివారం స్థానిక ఎన్జీవో హోంలో జిల్లా ఎన్జీవో ప్రెసిడెంట్ రాఘవులు, జిల్లా ఎన్జీవో సెక్రటరీ రఘు, ఉమ్మడి చిత్తూరు జిల్లా బోధనేతర సిబ్బంది సంఘం గౌరవ అధక్షులు దురై కన్నాన్, అధ్యక్షులు హరిప్రసాద్, సెక్రటరీ విద్యాసాగర్, సంఘ సభ్యులు ఆవిష్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని చవనపల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ క్యాలెండర్‌ను దిగువపల్లలు గ్రామ కమిటీ అధ్యక్షుడు బాలాజీ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ విఎం.థామస్ ఆవిష్కరించారు. మినీ గోకులం షెడ్డును ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షులు లోకనాథరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి, లోకనాథ్‌రెడ్డి, మునిచంద్రారెడ్డి, దామోదర్ రెడ్డి, జయచంద్రారెడ్డి, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

ఎడాపెడా తరలిపోతున్న ఇసుక

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : కుశస్థలి నదిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో ఇసుకాసురులు తమ వేటను ప్రారంభించారు. సత్రవాడ, తెరణి, మిట్టపాళెం ప్రాంతాల్లో ఇసుక వ్యాపారస్తులు తరలింపును మొదలుపెట్టారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణాలకు, సీసీ రోడ్లకు, ప్రభుత్వ సంబంధిత పనులకు మాత్రమే ఇసుక తీసుకోవాలి. వంతెనల సమీపం, శ్మశానం సమీపం ఇసుక తీయకూడదు. అయితే ఈ నిబంధనలన్నీ వారు తుంగలో తొచ్చేశారు. దాదాపు 100 ట్రాక్టర్లకు పైగా ఇసుకను తీసుకెళుతున్నారు. వంతెనల పక్కన, శ్మశానాల పక్కన ఇసుకను తోడేస్తున్నారు. ఇసుకను డంపింగ్ చేసి తమిళనాడుకు తరలిస్తున్నట్లు స్థానిక యువజన సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. వారిని నివారించేందుకు వెళ్లే గ్రామస్తులను బెదిరిస్తున్నారన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని పలమనేరు -పుంగనూరు రహదారి కూర్నిపల్లి నుండి వి.రామాపురం వరకు తారు రోడ్డు నిర్మాణానికి శనివారం శాసనసభ్యులు అమరనాథరెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. అమర్నాథరెడ్డి కృషి సహకారంతో కూర్నపల్లి నుండి వి.రామాపురం వరకు రూ.77 లక్షలతో కిలోమీటర్ మేర తారు రోడ్డు మంజూరు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఈదారికి మోక్షం కలగలేదని ప్రస్తుతం తమ గ్రామాలకు నాణ్యమైన రోడ్డు రావడంతో ఆనందంగా ఉందని గ్రామస్తులు తెలిపారు.

సిఎన్ఆర్ కళాశాలలో

వివేకానంద జయంతి వేడుకలు

ప్రజాశక్తి - గుడిపాల: స్థానిక సీఎన్ఆర్ కళాశాలలో వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవ ముందస్తు కార్యక్రమంలో భాగంగా వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన చిత్తూరు నెహ్రూ యువ కేంద్ర సమన్వయకర్త ప్రదీప్ మాట్లాడుతూ వివేకానందుడు చిన్నప్పటినుంచి అసాధారణ మేదస్సు కలవారని, ఆధ్యాత్మికత పట్ల ఆసక్తి చూపించే వారని తెలిపారు. విశిష్ట అతిథులు రచయిత, కవి, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షులు పసపల హరికృష్ణా రెడ్డి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మాన్ని పునర్జీవింపజేసిన గొప్ప వ్యక్తి వివేకానంద అన్నారు. విద్యార్థులందరూ స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలు చదివి జీవితంలో మహోన్నత శిఖరానికి ఎదగాలన్నారు. కళాశాల వ్యవస్థాపకులు లోకేష్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని, ఆధ్యాత్మికతను ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు స్వామి వివేకానంద సూక్తుల నినాదంతో ర్యాలీగా వెళ్లారు. కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి అర్జున్, అధ్యాపకులు రంజిత్ కుమార్, హేమంత్ కుమార్, మీనా కుమారి, రేవతి, గాయత్రి, శ్వేత పాల్గొన్నారు.

పదవులను బాధ్యతగా నిర్వహిస్తాం..

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : తమపై నమ్మకంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పదవిని బాధ్యతలతో నిర్వహిస్తామని జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా, క్రియాశీలక కార్యదర్శిగా ఎంపికైన బీడీ భాస్కర, టీసీ మురగయ్య తెలిపారు. తమకు పదవులు రావడానికి కారణమైన మాజీ మంత్రి ఆర్కేరోజాను పూలదండలు, దుస్సాలువలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన పదవులతో బాధ్యతాయుతంగా వ్యవహరించి పార్టీ ఉన్నతికి తోడ్పడాలన్నారు. నాయకులు బాబు, చంద్ర పాల్గొన్నారు.

తొక్కిసలాట ఘటన చాలా బాధాకరం

- **ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి**

ప్రజాశక్తి- పుంగనూరు

వైకుంఠ ఏకాదశి టికెట్ల కోసం తిరుపతిలో జరిగిన తొక్కిసలాట చాలా బాధాకరం అని ప్రభుత్వ వైఫల్యమే ఈ దారుణానికి కారణం రాజంపేట పార్లమెంటు సభ్యుడు పివి మిథున్ రెడ్డి అన్నారు. పుంగనూరు పట్టణంలో పలు ప్రైవేటు కార్యక్రమంలో ఎంపీ ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఇది కేవలం క్షమాపణలు చెప్పి సర్దుకునేంత చిన్న విషయం కాదు అన్నారు. కచ్చితంగా బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంబంధం లేని అధికారులపై కంటితుడుపు చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. అసలు ఈ ఘటనకు బాధ్యత వహించాల్సిన అధికారులపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పవన్ కళ్యాణ్ కనీసం తప్పు జరిగిందని ఒప్పుకుని క్షమాపణలు చెప్పారని, చంద్రబాబు ఆ పని కూడా చేయకుండా ఈ ఘటన వెనుక కుట్రకోణం అని మళ్లీ రాజకీయం చేయాలని చూశారన్నారు. ఇప్పటికైనా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ నాగభూషణం, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, జయరామిరెడ్డి, కొత్తపల్లి చెంగారెడ్డి, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

టిటిడి ధర్మకర్తల మండలి రద్దు చేయాలి: బిసివైపి

వైకుంఠ ఏకాదశి పర్వదినానికి టోకన్లు మంజూరు చేసే సమయంలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందిన సంఘటన దురదృష్టకరమని దీని బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, టిటిడి బోర్డును వెంటనే రద్దు చేయాలని బీసీవైపి వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వారా దర్శనం కోసం వచ్చిన భక్తుల్లో ఆరు మంది చనిపోవడం చాలా బాధాకరమని, ఇప్పటికే మా బిసివై పార్టీ తరుపున మృతుల కుటుంబాలకు రూ.50 వేలు లెక్కన ఆర్థిక సాయం కూడా చేశామన్నారు. అయితే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే శాశ్వతమైన కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలిని రద్దు చేస్తే శ్రీవారి భక్తుల్లో మీ పాలన పట్ల విశ్వాసం పెంచిన వారవుతారని అన్నారు.

తిరుపతి ఘటనలో మొదటి ముద్దాయి చంద్రబాబే

మాజీ మంత్రి ఆర్కేరోజా

విజయపురం (నగరి): తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు మృతిచెంది 60మంది గాయపడిన సంఘటనలో మొదటి ముద్దాయి చంద్రబాబే అని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఈ ఘటనలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, ఒకరిపై కూడా కేసు నమోదు చేయకపోవడంపై ఆమె తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు స్పందించారు. దోషులపై కేసుపెట్టకుండా కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారంటూ దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి హిందువులంటే గౌరవం లేదా? భక్తులంటే గౌరవం లేదా? వారి ప్రాణాలకు విలువలేదా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. సిఎం చంద్రబాబు, టీటీడీ ఈవో, చైర్మన్, అడిషనల్ ఈవో, ఎస్పీతో సహ అందరిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మొదటి ముద్దాయి చంద్రబాబు నాయుడును చేర్చాలన్నారు. డిప్యూటీ సీఎం క్షమాపణలు చెబుతున్నారని మనుషుల్ని చంపేసి క్షమాపణ చెబితే సరిపోదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకూడదని, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, న్యాయపరంగా పోరాడుతామన్నారు.

కబడ్డీ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-యాదమరి

మండలంలోని దలవాయిపల్లి గ్రామపంచాయతీలో శనివారం సంక్రాంతి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రారంభించారు. ఈ పోటీలు టిడిపి మండల అధ్యక్షులు మొరార్జీ యాదవ్ అధ్యక్షతన ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులతో కొద్దిసేపు సరదాగా కబడ్డీ ఆడారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో అందరూ కలిసిమెలిసి ఐక్యతగా ఆటల పోటీలను నిర్వహించడం చాలా సంతోషకరమన్నారు. క్రీడలు మనిషిని ఆరోగ్యకరంగా ఉంచేందుకు దోహదపడుతుందన్నారు. విద్యార్థులు, యువకులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరమఅన్నారు. గ్రామ అభివృద్ధిలో గాని యువకులు, విద్యార్థులపాత్ర ఎంత కీలకమని ఆ దిశగా గ్రామాన్ని ఐక్యతతో అభివృద్ధి పదంలో నడిపించేందుకు ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కబడ్డీ పోటీలకు యాదమరి, బంగారుపాళ్యం మండలం పరిధిలోని సుమారు 30టీములు ఆటల్లో పాల్గొన్నారు. ఆటల్లో గెలుపొందిన టీమ్‌లకు మొదటి బహుమతి రూ.25వేలు, రెండో బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.15వేలు అందించనున్నారు. గ్రామ సర్పంచ్ యశోద, జిల్లా కార్యదర్శి చిట్టిబాబు, వల్లేరు అమరనాథ నాయుడు, బంగారుపాళ్యం మండల అధ్యక్షుడు ఎన్‌పి.జయప్రకాష్ నాయుడు, సుభాష్ నాయుడు, వెంకటేష్, రబి, చిత్ర, జనసేన మండల అధ్యక్షుడు కుమార్ పాల్గొన్నారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు

చిత్తూరులో..

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక రామ్‌నగర్ కాలనీలోని హార్వడ్ ఇంగ్లీష్ మీడియా పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులలో పాఠశాల కరెస్పాండెంట్ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కరెస్పాండెంట్ భాస్కర్ మాట్టాడుతూ తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతి విశిష్టతను విద్యార్థులు తెలుసుకోవాలని, విద్యతో పాటు అన్ని రాంగాల్లో రాణించాలని కోరారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో కళాతరంగిణి సంస్థ అధ్వర్యంలో శనివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గులపోటీలు కోలాహలంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలు, విద్యార్థినులు ముగ్గులపోటీల్లో ఉత్సాహంగా పాల్గొని ఆకర్షణీయంగా రంగవల్లులు తీర్చిదిద్దారు. ఇందులో గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముగ్గులపోటీలలో ప్రథమ బహుమతి రాధారాజ్, ద్వితీయ బహుమతి ప్రవీణ, తృతీయ బహుమతి అమరావతి గెలుచుకున్నారు. హెచ్ఎం చైతన్యాచారి, కడపనత్తం సాగునీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మంజునాథ గౌడు, సిఆర్‌పిలు రామచంద్ర, వెంకటరమణ, స్వచ్ఛ భారత్ ఎంసీఓ సురేష్ బాబు, న్యాయ నిర్ణేతలు సంధ్య, హఫ్సాన, సీనియర్ ఆర్టిస్టులు రాజన్న, రాజగోపాల్, నిర్వహకులు మురళీధర్, శ్రీనివాసులు, రాజేంద్ర, గోపి పాల్గొన్నారు.

కార్వేటినగరం: సంక్రాంతి సంబరాలు స్థానిక శ్రీలక్ష్మీ నరసింహ విద్యాసంస్థలో శనివారం అంబరాన్నంటాయి. డైరెక్టర్లు దిలీప్ కుమార్, ధనంజయరెడ్డి, పురుషోత్తం, వెంకటేష్ల ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థ ఆవరణాన్ని మామిడి ఆకుల తోరణాలు, చెరకు గడలు, పూల దండులు, గాలిపటాలు, రంగవల్లికలు, భోగి మంటలు, పొంగళ్లతో పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థులకు రంగవల్లికల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ కిషోర్, వేణుగోపాల్, శ్రీను, శరవణ, జమున, నరేష్, పద్మనాభం, విద్యార్థులు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పట్టణంలో స్థానిక బిఎంఎస్ క్లబ్ ఆవరణంలో వారాహి గ్రూప్ తరపున శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పుంగనూరు పట్టణానికి చెందిన 30మంది మహిళలు ముగ్గులు పోటీల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఇందులో మొదటి, రెండవ, మూడవ బహుమానంతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్సాహక బహుమతి ఇవ్వడం జరిగింది. వారాహి గ్రూప్స్ ఫౌండర్ హేమంత్ రాయల్, గ్రూప్ మెంబర్స్ వరలక్ష్మి, రాఘవి, జయలక్ష్మి పావన, త్రిలోక్, శ్రీనిధి, మౌనిక పాల్గొన్నారు.

రచయితల సంఘం ఆధ్వర్యంలో

నేడు సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రచయితల సంఘం నేతృత్వంలో ఆదివారం స్థానిక నాగయ్య కళాక్షత్రంలో సక్రాంతి వేడుకలు నిర్వహించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో రచియత సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సహదేవ నాయుడు తెలిపారు. వివిధ రంగాల్లో సేవలందించిన 200 మందికి సన్మానం చేయడం రచయిత సంఘం, కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కోలాటాలు, గొబ్బిళ్ళు , చెక్కభజనలు, గంగిరెద్దులు, హరిదాసులు, రంగవల్లులు మొదలగు కళారూపాల ప్రదర్శనలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ సాహిత్య, సాంస్కృతిక, కళా రంగాల, సంస్థల ప్రతినిధులు కవులు, రచయితలు, కళాకారులు, గాయకులు, సమాజ సేవకులు, పురప్రజలు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

IN THE COURT OF THE II[ND] ADDITIONAL DISTRICT JUDGE:: MADANAPALLE

I.A.No. 286/2024, A.S.No. /2024

T.N. Rangamma and Others **... Petitioners/Appellants**

N.Lakshmamma and others **...Respondents**

NOTICE

To

R2) Bathula Subramanyam, S/o. Chinna Swamy.

R3) Bathula Ganesh, S/o. Subramanyam, Both are residing at Jammuneredupalle, H/o Bodbandla, Katappagiripalle Post, Bangarupalem Mandal, Chittoor District.

Please take notice that the above I.A. No. 286/2024 stands posted to 22/01/2025 for your apperance before the above said court at 10:30am in person or through your pleader and if you fails to appear before the above said court on 22.01.2025 at 10:30am. The matter will be heard and decided exparte.

SRI B. BHUJANGA RAO, B.Sc., L.L.B.,
SRI S. BHASKAR REDDY, B.Com., L.L.B.,
Advocates, Madanapalle

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION) OF CHITTOOR

H.M.O.P.No. 40 of 2024

Between:
Jayachandra Santhosh ....Petitioner
And:
Rankupalli Sukanya ...Respondent

NOTICE TO THE RESPONDENT

To
Smt. Rankupalli Sukanya,
W/O. J.Santhosh, D/O. R.Chitti Babu, residing at Thumbakuppam Village and Post, Bangarupalem Mandal, Chittoor District,

Please take notice that the petitioner filed the above petition for dissolution of marriage dt. 19-10-2011 of the petitioner and the respondent on the file of the above said court against the respondent. The said petition stands posted to 13.02.2025 for your appearance before the above said Hon'ble Court. Please attend before the above said Court on 13.02.2025 at 10-30 a.m. either in person or through your counsel and to file your objections if any, failing which the matter will be decided exparte.

Sd/- C. SURESH REDDY,
ADVOCATE FOR PETITIONER
Place:Chittoor, Date: 11.01.2025